సాక్షి
జోగులాంబ గద్వాల
ఆదివారం । 12 । మార్చి । 2023



వణికిస్తున్న జ్వరాలు
జ్వరం, దగ్గు, శ్వాసకోశ సమస్యలతో ఆస్పత్రులకు రోగుల తాకిడి పెరుగుతోంది.
వివరాలు 8లో ▸



ప్రణాళిక లోపం..
దేవరకద్రలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం ముందుకు సాగడం లేదు.
వివరాలు 8లో ▸

వాతావరణం
గరిష్ఠం/కనిష్ఠం 36.1 /21.4
మధ్యాహ్నం తీవ్ర ఉక్కపోత ఉంటుంది. సాయంత్రం ఆకాశం మేఘావృతం అవుతుంది. రాత్రి కొద్దిమేర చలి ఉంటుంది.

రాజీనామా.. హైడ్రామా..!

వనపర్తిలో వేడెక్కిన రాజకీయం

- కాంగిరేసులో లొల్లి.. చిన్నారెడ్డిపై భగ్గుమన్న అసమ్మతి
- నలుగురు కౌన్సిలర్లు, ఓ నాయకుడు రాజీనామా
- ఆయనను వదులుకోమని అంటూనే అభ్యర్థిత్వంపై మెలిక
- 'రావుల' వస్తే సహకరిస్తామని వెల్లడి
- బీఆర్ఎస్ మాజీ నేత మేఘారెడ్డితో శివసేనారెడ్డి ఏకాంత చర్చలు
- జాగ్రత్తగా గమనిస్తున్న 'గులాబీ' నేతలు

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: అసంతృప్త జ్వాలలు ఎగిసిపడుతుండడంతో వనపర్తి రాజకీయాలు హీటెక్కాయి. అధికార పార్టీ భారత రాష్ట్ర సమితిలో అసమ్మతి నేతల రాజీనామాలతో రగిలిన చిచ్చు కాంగి'రేసు'లో కుంపట్లను రాజేసింది. నాలుగైదు నెలల క్రితం 'హస్తం'లో లుకలుకలు వెలుగులోకి వచ్చినప్పటికీ.. ప్రస్తుత పరిణామాలు కొత్త పుంతలకు దారితీయడం హాట్‌టాపిక్‌గా మారింది. తాజాగా శనివారం మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నేత చిన్నారెడ్డి ఎమ్మెల్యే అభ్యర్థిత్వాన్ని వ్యతిరేకిస్తూ వనపర్తి మున్సిపాలిటీకి చెందిన నలుగురు కౌన్సిలర్లు, ఓ నాయకుడు ఆ పార్టీకి రాజీనామా చేశారు. అయితే చిన్నారెడ్డి అనుకూల, వ్యతిరేక వర్గాలతో శుక్రవారం రాత్రిళ్లు నడిచిన శిబిరాలు.. విలేకరుల సమావేశంలో రాజీనామాకు గల కారణాలను వెల్లడిస్తున్న క్రమంలో వారు తడబాటు పడడం.. చిన్నారెడ్డికి అత్యున్నత ప్రాధాన్యం ఇవ్వాలని అంటూనే ఆయన అభ్యర్థిత్వంపై మెలిక పెట్టడం.. ఇదే సమయంలో 'రావుల' వస్తే సహకరిస్తామని వెల్లడించడం హైడ్రామాను తలపిస్తున్నాయి. ఈ నాటకీయ పరిణామాలను బీఆర్ఎస్ ముఖ్యనేతలు నిశితంగా పరిశీలిస్తుండడంతో పాటు ఏయే పార్టీ వారు.. ఎవరు ఎవరిని కలుస్తున్నారని నిఘా పెట్టినట్లు సమాచారం.



రాజీనామా పత్రాలు చూపుతున్న కాంగ్రెస్‌పార్టీ కౌన్సిలర్లు

ఇరువర్గాల వాగ్వాదం..

చిన్నారెడ్డి ఎమ్మెల్యే అభ్యర్థిత్వాన్ని వ్యతిరేకిస్తూ రాజీనామా చేస్తున్నట్లు వనపర్తి, పెబ్బేరు మున్సిపాలిటీకి చెందిన పలువురు కౌన్సిలర్లు రెండు రోజుల క్రితమే ప్రకటించిన విషయం తెలిసిందే. అయితే వారికి చిన్నారెడ్డితో పాటు పలువురు కాంగ్రెస్ పెద్దలు ఫోన్ చేసి బుజ్జగించినట్లు సమాచారం. శుక్రవారం ఏదో ఒకటి తేలుస్తామని చెప్పగా.. వారు మిన్నకుండి పోయినట్లు తెలిసింది. ఈ క్రమంలో రాత్రి కాంగ్రెస్ అసమ్మతి నాయకుడు సతీష్‌కుమార్ ఇంటికి చిన్నారెడ్డి వెళ్లి మాట్లాడుతుండగా.. ఓ పట్టణ నాయకుడితో పాటు పలువురు అక్కడికి వెళ్లి సతీష్‌తో పాటు మిగిలిన అసమ్మతి వర్గంతో వాదనకు దిగినట్లు సమాచారం. దీంతో ఇరువర్గాల మధ్య వాగ్వాదం చోటుచేసుకోగా.. చిన్నారెడ్డిని అక్కడి నుంచి తీసుకెళ్లారు. ఆ తర్వాత ఆయన తన మద్దతుదారులతో అర్ధరాత్రి 1.30 గంటల వరకు సమావేశమైనట్లు తెలిసింది.

ఏం జరుగుతోంది.. పక్క జిల్లాల నేతలు ఆరా

బీఆర్ఎస్‌కు రాజీనామా చేసిన మంత్రి సన్నిహితుడు, పెద్దమందడి ఎంపీపీ మేఘారెడ్డితో యూత్ కాంగ్రెస్ నేత శివసేనారెడ్డి ఏకాంతంగా చర్చలు జరిపినట్లు తెలిసింది. మరోవైపు కాంగ్రెస్‌లో అసమ్మతి వర్గానికి నేతృత్వం వహిస్తున్న ఒకరు గతంలో బీఆర్ఎస్‌లో ఉన్నట్లు సమాచారం. అతడు మంత్రికి దూరపు బంధువనే ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో రాజకీయ వర్గాల్లో విభిన్న రకాల వాదనలు వినిపిస్తున్నాయి. కాగా.. వనపర్తిలో మంత్రిపై తిరుగుబావుటా ఎగురవేసి.. బీఆర్ఎస్‌ను వీడిన నాటి నుంచి మారుతున్న రాజకీయ పరిణామాలపై ఉమ్మడి పాలమూరువ్యాప్తంగా రాజకీయ వర్గాలు ఆసక్తిగా గమనిస్తున్నాయి. ప్రధానంగా నాగర్‌కర్నూల్, కొల్లాపూర్, అలంపూర్, గద్వాల నియోజకవర్గాల నాయకులు వనపర్తి నియోజకవర్గంలో తమకు పరిచయమున్న వ్యక్తులకు రోజువారీగా ఫోన్లు చేస్తూ ఆరా తీస్తున్నారు.

బహిష్కృత నేతకే రాజీనామాల సమర్పణ

వనపర్తిలో అధికార బీఆర్ఎస్‌తోపాటు కాంగ్రెస్‌లో చోటుచేసుకున్న రాజకీయ పరిణామాలు టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి దృష్టికి వెళ్లాయి. ఈ మేరకు అసమ్మతి నాయకులతో ఆయన మాట్లాడినట్లు ప్రచారం జరిగింది. ఆ తర్వాత రేవంత్ ఆదేశాలతో యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివసేనారెడ్డి సైతం వారితో సంప్రదింపులు జరిపినట్లు సమాచారం. అయితే మాట్లాడేందుకు వచ్చిన చిన్నారెడ్డిని.. చర్చించకుండానే తీసుకెళ్లారని ఆయనకు అసమ్మతి నాయకులు సమాచారం చేరవేయడంతో పాటు రాజీనామా చేస్తున్నట్లు విలేకర్ల సమావేశం నిర్వహించి ప్రకటించారు. అయితే కాంగ్రెస్ అసమ్మతి కౌన్సిలర్లు వెంకటేష్ (21వ వార్డు), బ్రహ్మయ్యాచారి (14వ వార్డు), కాంగ్రెస్ ఫ్లోర్‌లీడర్ రాధాకృష్ణ (31వ వార్డు), జయసుధ (10వ వార్డు)తో పాటు సతీష్‌కుమార్ తమ రాజీనామా పత్రాలను కాంగ్రెస్ బహిష్కృత నేత, డీసీసీ మాజీ అధ్యక్షుడు శంకర్‌ప్రసాద్‌కు ఇవ్వడం చర్చనీయాంశంగా మారింది.

న్యూస్‌రీల్

మహిళలకు రక్షణ కరువు



గద్వాల అర్బన్: చిన్నారుల నుంచి వృద్ధురాలి వరకు దేశంలో రక్షణ కరువైందని ఐద్వా రాష్ట్ర అధ్యక్షురాలు అరుణ జ్యోతి అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలో ఆ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. అన్ని రంగాల్లో మహిళలకు భద్రత లేదన్నారు. ప్రతి మహిళకు స్వేచ్ఛ, సమానత్వంతోపాటు ఆర్థిక, సామాజిక, రాజకీయ రంగాల్లో ఎదిగినప్పుడు సమాజం మార్పు చెందుతుందన్నారు. నిత్యావసర ధరలను పెంచడం వల్లన మహిళలపై ఆర్థిక భారం పడుతుందని, వెంటనే ధరలను తగ్గించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఐద్వా జిల్లా కార్యదర్శి నర్మద, సభ్యులు శివమ్మ, సుష్మ, యాషిన్ తదితరులు ఉన్నారు.

అధికారంలోకి వస్తే రూ.2లక్షల రుణమాఫీ



ఎర్రవల్లిచౌరస్తా: వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ఏకకాలంలో రైతులకు రూ.2లక్షల రుణమాఫీ చేస్తామని ఏఐసీసీ కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్ అన్నారు. కాంగ్రెస్ ఆధ్వర్యంలో చేపట్టిన హాథ్ సే హాథ్ జోడో యాత్ర శనివారం ఇటిక్యాల మండలంలోని కోదండాపురం, సాతర్ల, వావిలాలలలో కొనసాగింది. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ప్రజలతో మమేకమై వారి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కేసీఆర్ గత ఎన్నికల్లో రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చి నిట్టనిలువునా మోసం చేశాడని, డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఎంత మందికి ఇచ్చారో సమాధానం చెప్పాలన్నారు. దళితులకు ఇస్తానన్న మూడెకరాల భూమి ఎటు పోయిందన్నారు. నిరంకుశ పాలనతో నివ్వెరపోయిన రాష్ట్ర ప్రజలు కాంగ్రెస్ పాలన కోసం ఎదురుచూస్తున్నారని, అధికారంలోకి వచ్చిన వెంటనే ఒకే ఇంట్లో ఇద్దరికి పింఛన్లు, సిలిండర్ ధర రూ.500కి తగ్గింపు, పంటలకు గిట్టుబాటు ధర కల్పిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జోగుల రవి, వెంకటేష్, నారాయణ నాయుడు, కార్యకర్తలు పాల్గొన్నారు.

యార్డుకు 2,754 క్వింటాళ్ల వేరుశనగ

గద్వాల వ్యవసాయం: గద్వాల మార్కెట్ యార్డుకు శనివారం 2,754 క్వింటాళ్ల వేరుశనగ అమ్మకానికి వచ్చింది. కాగా, క్వింటాకు గరిష్ఠంగా రూ.6,698, కనిష్ఠం రూ.4,469, సరాసరి రూ.5681 ధరలు లభించాయి. అలాగే, 64 క్వింటాళ్ల ఆముదం రాగా గరిష్ఠం రూ.6,279, కనిష్ఠం రూ.5,919, సరాసరి రూ.6,259 ధర పలికింది. 25 క్వింటాళ్ళ కంది రాగా, గరిష్ఠం రూ.7859, కనిష్ఠం రూ.7719, సరాసరి రూ 7859 ధరలు పలికాయి.

శ్రీశైలం ఘాట్ రోడ్డులో తప్పిన ప్రమాదం

దోమలపెంట: టీఎస్ ఆర్టీసీ సికింద్రాబాద్ పికెట్ డిపోకు చెందిన బస్సుకు శనివారం శ్రీశైలం డ్యాం సమీపంలో త్రుటిలో పెను ప్రమాదం తప్పింది. వివరాలిలా.. శ్రీశైలం నుంచి హైదరాబాద్‌కు బయల్దేరిన బస్సు ఆంధ్రప్రదేశ్ కర్నూలు జిల్లా పరిధిలోని శ్రీశైలం డ్యాం సమీపంలో ఘాట్‌రోడ్డు మలుపు వద్ద ఎదురుగా కారు రావడంతో దానిని తప్పించబోగా.. బస్సు రోడ్డు పక్కనే ఉన్న గుంతలో దిగి ముందుకు కదల్లేకపోయింది. సమాచారం అందుకున్న కర్నూలు జిల్లా సున్నిపెంట పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని బస్సులోని ప్రయాణికులను ఇతర బస్సులో పంపించారు. బస్సును రోడ్డుపైకి తీసుకుని రావడానికి ప్రయత్నిస్తున్నారు. ఈ ఘటనతో ట్రాఫిక్ సమస్య ఏర్పడుతుంది. కాగా నెలన్నర క్రితం ఇదే మలుపు వద్ద మహబూబ్‌నగర్ డిపోకు చెందిన అద్దె బస్సు ఘోర ప్రమాదం నుంచి బయటపడింది.



ప్రారంభమెప్పుడో..?



అయిజ మున్సిపాలిటీలో నిర్మించిన ఎఫ్ఎస్‌టీ ప్లాంట్

- గద్వాల, అయిజలో ఎఫ్ఎస్‌టీ ప్లాంట్ల నిర్మాణం
- నెలలు గడుస్తున్నా ప్రారంభానికి నోచుకోని వైనం
- వడ్డేపల్లి, అలంపూర్‌లో నిర్మాణ అనుమతుల కోసం ఎదురుచూపులు
- మానవ వ్యర్థాల శుద్ధి.. స్వచ్ఛతే లక్ష్యంగా ప్లాంట్ల ఏర్పాటు

అయిజ: స్వచ్ఛత.. పారిశుద్ధ్యమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రధానంగా మున్సిపాలిటీల్లో మానవ వ్యర్థాల శుద్ధీకరణ ప్లాంట్ (ఎఫ్ఎస్‌టీ/ ఫీకల్ సడ్జ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్)లను రూ.కోట్లు వెచ్చించి నిర్మిస్తోంది. ఈక్రమంలో జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీల్లో రెండు చోట్ల నిర్మాణాలు పూర్తయి నెలలు గడుస్తున్నా ప్రారంభానికి మాత్రం నోచుకోవడంలేదు.

ఎరువు తయారీ..
మున్సిపాలిటీల్లో నివాస గృహాల సెప్టిక్ ట్యాంకుల నుంచి సేకరించిన మానవ విసర్జితాలను శుద్ధీ చేసి ఎరువు తయారు చేసేందుకు గద్వాల, అయిజ మున్సిపాలిటీల్లో రూ.1.2 కోట్లతో ఎఫ్ఎస్‌టీపీలను నిర్మించారు. అనారోబిక్ సేఫ్టీలైజేషన్ రియాక్టర్‌తో మెథనైజేషన్ పద్ధతిలో శుద్ధిచేసి ఎరువుగా మార్చుతారు. ఈప్రక్రియ మొత్తం ఆధునిక సాంకేతిక పద్ధతిలో చేపట్టనున్నారు. ఒక్కో ప్లాంట్‌లో ఒకసారికి 10 కేఎల్‌డీ (10 వేల లీటర్ల సామర్థ్యం) గల విసర్జితాలు శుద్ధిచేసే అవకాశం ఉంది. ఈ ప్లాంట్ నిర్వహణ పీవీవీ ఎన్‌ప్రా కంపెనీ పదేళ్లపాటు చూసుకోనుంది. సెప్టిక్ ట్యాంక్ యజమానితో మున్సిపాలిటీ అధికారులు ఒప్పందం చేసుకొని ప్లాంట్‌కు వ్యర్థాలను తరలించే విధంగా చర్యలు తీసుకోనున్నారు. అనంతరం ప్లాంట్‌లో మలాన్ని ఎరువుగా మార్చి యూనిట్ నిర్వాహకులు కిలోల చొప్పున లెక్క కట్టి విక్రయిస్తారు. అది వ్యవసాయానికి ఎరువుగా ఉపయోగపడుతుంది. ఇదిలాఉండగా, ఆ ప్లాంట్ నిర్వహణకు సౌలభ్యంగా ఉండేందుకు వివిధ నిర్మాణాలు చేపట్టారు. అందులో భాగంగా ఆఫీస్‌రూం, మీటింగ్ హాల్, కలెక్షన్ చాంబర్స్, ట్రీట్‌మెంట్ షెడ్, స్టోరేజీ రూం, వాచ్‌మెన్ క్వాటర్, ల్యాబ్, వేయింగ్ బ్రిడ్జి, అలాగే ప్లాంట్ చుట్టూ ప్రహరీ నిర్మించారు.

ట్రయల్ రన్ పూర్తి..
గద్వాల, అయిజ మున్సిపాలిటీల్లో ఎఫ్ఎస్‌టీపీ నిర్మాణాలు పూర్తి కాగా ట్రయల్ రన్ సైతం నిర్వహించారు. అయితే వాటిని ఇప్పటి వరకు అధికారికంగా ప్రారంభించలేదు. దీంతో పట్టణ ప్రజలకు ఎఫ్ఎస్‌టీ ప్లాంట్ గురించి అవగాహన లేకుండా పోయింది. పట్టణాల్లో వివిధ కాలనీలలో సెప్టింక్ ట్యాంక్‌ల నుంచి సేకరించిన మానవ వ్యర్థాలను ఊరి బయట, ఎక్కడ పడితే అక్కడ పారవేస్తుండడంతో పర్యావరణం కలుషితమవుతోంది. ఇదిలాఉండగా, వడ్డెపల్లి మున్సిపాలిటీలో ఎఫ్ఎస్‌టీ ప్లాంట్ నిర్మాణం చేపట్టేందుకు మున్సిపల్ అధికారులు పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అనుమతి కోరగా ఇంతవరకు అనుమతి రాలేదు. అనుమతి వచ్చిన అనంతరం నిర్మాణం చేపట్టే అవకాశం ఉంది. అలంపూర్ మున్సిపాలిటీలో ప్లాంట్ నిర్మాణ ప్రక్రియను హోల్డ్‌లో పెట్టారు. ఇక్కడ గతంలోనే ప్లాంట్ ఉండగా.. దాన్ని వినియోగంలోకి తీసుకొచ్చేందుకు అధికారులు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.

త్వరగా ప్రారంభించాలి



అయిజ మున్సిపాలిటీలో రూ.కోటి ఖర్చు చేసి ఎఫ్ఎస్‌టీ ప్లాంట్ నిర్మించారు. దీంతో మున్సిపాలిటీలో పారిశుద్ధ్యం మెరుగుపడేందుకు అవకాశం ఉంది. వెంటనే దీనిని ప్రారంభించి ప్రజలకు అవగాహన కల్పిస్తే పర్యావరణానికి మేలు చేసిన వారం అవుతాం.
– తాహేర్, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా ఉపాధ్యక్షుడు

ఆధునిక టెక్నాలజీతో..



ఎఫ్ఎస్‌టీ ప్లాంట్ల ద్వారా మానవ విసర్జితాలను పాలిసింగ్ పండ్‌లో పాస్ఫరేట్, సల్ఫర్ ద్వారా శుద్ధిచేసి నీటిని వేరు చేసి ప్యూరిఫైడ్ వాటర్‌గా మార్చుతారు. మలాన్ని ఎరువుగా తయారుచేస్తారు. ప్లాంట్‌లో ఒకసారికి 10 వేల లీటర్ల సామర్థ్యం గల విసర్జితాలు శుద్ధిచేసే అవకాశం ఉంటుంది.
– గోపాల్, మున్సిపల్ ఏఈ, అయిజ

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం



ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోనే మొదటగా అయిజ మున్సిపాలిటీలో ఎఫ్ఎస్‌టీపీ ప్లాంట్ పూర్తి కావడం సంతోషం. పర్దీపురం సమీపంలో ఎస్ఎఫ్‌టీ ప్లాంట్ నిర్మాణం గత ఏడాది పూర్తయ్యింది. అయితే ప్లాంట్‌ను అధికారికంగా ప్రారంభించాల్సి ఉంది. అది ఉన్నతాధికారుల చేతుల్లో ఉంది. వారి దృష్టికి తీసుకెళ్తాం.
– నర్సయ్య, మున్సిపల్ కమిషనర్, అయిజ

పశువుల నీటి తొట్టిలు శుభ్రం

సాక్షి ఎఫెక్ట్..

రాజోళి: మండలంలోని తూర్పు గార్లపాడులోని పశువుల నీటి తొట్టిలను గ్రామ పంచాయతీ అధికారులు శుభ్రం చేయించారు. నిర్వహణ లేని, శిథిలావస్థకు చేరిన నీటితొట్టిలపై శుక్రవారం 'సాక్షి'లో 'మూగరోదన' అనే శీర్షికన కథనం రాగా.. అధికారులు స్పందించారు. గార్లపాడులోని పంచాయతీ సెక్రటరీ ఖలీమ్ ఆధ్వర్యంలో పంచాయతీ సిబ్బది నీటి తొట్టి చుట్టూ ఉన్న పిచ్చి మొక్కలను, ట్యాంకులోని వ్యర్థాలను తొలగించారు. తొట్టి చుట్టూ ముళ్ల చెట్లు, పిచ్చి మొక్కలు పెరగడమేగాక, పరిసరాలు అపరిశుభ్రంగా మారడంతో వాటిని సైతం శుభ్రపరిచి పశువులకు నీరు అందించే విధంగా తీర్చిదిద్దారు. దీంతో పాడి రైతులు హర్షం వ్యక్తం చేశారు.



తూర్పుగార్లపాడులో పశువుల నీటి తొట్టిను శుభ్రం చేస్తున్న పంచాయతీ సిబ్బంది

నిబంధనలకు పాతర



మాన్‌దొడ్డిలోని మద్యం దుకాణంలో ఎన్నికల కోడ్ సమయం దాటాక అమ్మకాలు

- ఎన్నికల కోడ్ ఉన్నా.. యథేచ్ఛగా మద్యం అమ్మకాలు
- ధనార్జనే ధ్యేయంగా మద్యంషాపు నిర్వాహకులు తీరు

రాజోళి: ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినా మాకేంటి అన్నట్లు వ్యవహరిస్తున్నారు మద్యం షాపుల యజమానులు. కొందరు అధికారుల ప్రోద్బలంతో నిబంధనలకు పాతరేసి యథేచ్ఛగా మద్యం దుకాణాలు తెరిచి విక్రయాలు జరపడం గమనార్హం. శనివారం ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులోకి రాగా నిబంధనల ప్రకారం మద్యం షాపులు అధికారులు నిర్ణయించిన సమయానికి మూసివేయాల్సి ఉంది. కానీ మండలంలోని వైన్ షాపులు రాత్రి వరకు తీరిగ్గా అమ్మకాలు చేసుకొని.. ఆ తర్వాత మూసివేయడం కనిపించింది. ఇదిలాఉండగా, స్థానికంగా ఉన్న మద్యం దుకాణం ఇలా మూసివేశారో అక్రమ వ్యాపారులు మద్యం దుకాణం తెరిచేశారు. మద్యం దుకాణం బంద్ చేయడానికి ముందుగానే మద్యం కాటన్లు తీసుకుని పక్కనే పెట్టుకుని అమ్మకాలు జరపడం గమనార్హం. మరో షాపు మాన్‌దొడ్డిలో ఉండగా వారికి అసలు నిబంధనలతో సంబంధమేమి లేదన్నట్లు వ్యవహరించారు. సంబంధిత యజమాని రాత్రి 9 గంటల వరకు అమ్మకాలు చేయండని, ఏమవుతుందో చూద్దామని మరీ చెప్పి అమ్మకాలు చేసినట్లు సమాచారం.

అధికారుల అండదండలు..
మాన్‌దొడ్డి మద్యం షాపు తెరిచే ఉందని.. మద్యం అమ్మకాలు ఇంకా చేయడం ఏంటని 'సాక్షి' ఎక్సైజ్ అధికారిని ప్రశ్నించగా.. స్టాక్ అమ్ముకునే వరకు విక్రయించాలని తామే చెప్పామని బదులివ్వడం విడ్డూరం. కాగా అధికారికి ఫోన్ చేసిన కొద్ది సేపటికే సదరు షాపు బంద్ చేయడం పట్ల పలు అనుమానాలు వ్యక్తవుతున్నాయి. కాగా షాపులో పని చేసే వారు అధిక మొత్తంలో మద్యాన్ని బ్లాక్‌లో విక్రయించేందుకు తరలించినట్లు తెలుస్తుంది. రాజోళి, మాన్‌దొడ్డి వైన్ షాపుల్లో ఇదే ప్రక్రియ గాంధీ జయంతి, మద్యం అమ్మకాల నిషేధిత రోజుల్లోనూ యథేచ్ఛగా సాగుతుందని పలువురు గ్రామస్తులు ఆరోపించారు. ఇదిలాఉండగా, దీనిపై ఎక్సైజ్ ఎస్ఐ అనంతరెడ్డితో మాట్లాడగా.. ఎన్నికల కోడ్ అమలులో ఉందని దాని ప్రకారమే షాపులు మూతబడ్డాయని, ఎవరైనా స్టాక్ కోసం షాపు తీసి ఉండవచ్చని అన్నారు. కానీ నిబంధనలు ఉల్లంఘించి షాపులు నడిపితే వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

బండి సంజయ్ వ్యాఖ్యలు ఉపసంహరించుకోవాలి



బండి సంజయ్ దిష్టిబొమ్మ దగ్ధం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

గద్వాల రూరల్: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ ఎమ్మెల్సీ కవితపై చేసిన అనుచిత వాఖ్యలు ఉపసంహరించుకుని వెంటనే క్షమాపణ చెప్పాలని బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈమేరకు ఆయన శనివారం రాత్రి పత్రికా ప్రకటన విడుదల చేశారు. ధర్మం, న్యాయం అంటూ మాట్లాడే బీజేపీ నాయకులు మహిళలను అవమానపరిచేలా మాట్లాడడం వారి సంకుచిత స్వభావాన్ని తెలియజేస్తుందని మండిపడ్డారు. ఎమ్మెల్సీ కవితపై పెట్టిన కేసులకు భయపడేది లేదని, ఆమె వెన్నంటి ఉండి బీజేపీ దుర్మార్గాలపై పోరాటం చేస్తామన్నారు.

దిష్టిబొమ్మ దగ్ధం..
ఎమ్మెల్సీ కవితపై బండిసంజయ్ చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా బీఆర్ఎస్ పార్టీ నాయకులు శనివారం రాత్రి గద్వాల పాతబస్టాండ్‌లో బండి సంజయ్ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఈసందర్భంగా వారు బండి సంజయ్, బీజేపీ పార్టీలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు గోవిందు, సతీష్‌కుమార్, కౌన్సిలర్లు మురళి, నాగిరెడ్డి, నరహరి శ్రీనివాసులు, శ్రీమన్నారాయణ, మహేష్, మధు, రంజిత్ పాల్గొన్నారు.

భక్తులతో కిక్కిరిసిన ఆదిశిలా క్షేత్రం

మల్దకల్: ఆదిశిలా క్షేత్రమైన స్వయంభూ శ్రీలక్ష్మీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు రమేషాచారి, మధుసూధనాచారి స్వామి వారికి అభిషేకాలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ చైర్మన్ ప్రహ్లాదరావు, నిర్వాహకులు ఏర్పాట్లు చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు దీరేంద్రదాసు, చంద్రశేఖర్‌రావు, బాబురావు, నాగరాజుశర్మ తదితరులు పాల్గొన్నారు.



పూజలు నిర్వహిస్తున్న భక్తులు

రైతులకు ఇబ్బందులు రానివ్వం



ఏ.బూడిదపాడులోని లిఫ్ట్ ఇరిగేషన్ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే అబ్రహం

మానవపాడు: రైతులు ఇబ్బందులు పడకుండా లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా సాగునీరు అందిస్తామని ఎమ్మెల్యే అబ్రహం అన్నారు. శనివారం మండలంలోని ఏ.బుడిదపాడులోని లిఫ్ట్ ఇరిగేషన్‌ను ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. వడ్డేపల్లి మండలంలోని పైపాడుకి వెళ్లే దారిలోని వాగు, శ్రీరఘురామ లిఫ్ట్ ఇరిగేషన్ కొన్ని సమస్యల వల్ల పనిచేయడంలేదని, వెంటనే మరమ్మతులు చేపట్టి సమస్య పరిష్కారమయ్యేలా చూస్తానని అన్నారు.

బ్రిడ్జి పనులు సకాలంలో పూర్తిచేయండి
అయిజ: మండలంలోని యాపదిన్నె సమీపంలో నిర్మిస్తున్న బ్రిడ్జి పనులు సకాలంలో పూర్తిచేయాలని ఎమ్మెల్యే అబ్రహం అధికారులను ఆదేశించారు. శనివారం ఎమ్మెల్యే బ్రిడ్జి నిర్మాణ పనులను పరిశీలించారు. పనులు సకాలంలో నాణ్యతతో పూర్తి చేయాలని ఆదేశించారు. ఈక్రమంలో మిషన్ భగీరథ పైప్‌లైన్ బ్రిడ్జి మధ్యలో ఉండడంతో పైప్‌లైన్ లీకేజీ అయినప్పుడు మరమ్మతు చేసేందుకు ఇబ్బందులు తలెత్తుతాయని, పైప్‌లైన్‌ను పక్కకు మళ్లించాలని పలువురు ఎమ్మెల్యేను కోరారు. వెంటనే ఎమ్మెల్యే మిషన్ భగీరథ అధికారులతో ఫోన్‌లో మాట్లాడి పైపులైన్‌ను పక్కకు మళ్లించాలని ఆదేశించారు. కార్యక్రమంలో గుడుదొడ్డి సర్పంచ్ హనుమంతరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

క్షణికావేశంలో యువకుడి బలవన్మరణం

హన్వాడ: భార్యాభర్తల మధ్య ఏర్పడిన చిన్నపాటి గొడవ బలవన్మరణానికి దారితీసింది. వివరాల్లోకి వెళితే.. మండలంలోని బుద్దారం చెందిన పాడుగు నరేందర్(28), సువర్ణ భార్యాభర్తలు. శుక్రవారం గ్రామంలో ఓ శుభకార్యానికి సువర్ణ భర్తకు చెప్పకుండా వెళ్లింది. ఈ విషయంపై వారిద్దరి మధ్య చోటు చేసుకున్న చిన్నపాటి గొడవ పెద్దదైంది. దీంతో భార్య సువర్ణ గ్రామంలోని తమ పుట్టింటికి వెళ్లిపోగా అదేరాత్రి 11 గంటల ప్రాంతంలో నరేందర్ ఇంట్లో ఫ్యానుకు ఉరేసుకున్నాడు. శనివారం ఉదయం కుటుంబీకులు ఎంత పిలిచినా బయటికి రాకపోవడంతో తలుపులు బద్దలు కొట్టి చూడగా నరేందర్ మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రవి నాయక్ పేర్కొన్నారు.

గుండెపోటుతో సోలార్ ఉద్యోగి మృతి


లక్ష్మీరెడ్డి(ఫైల్)

గట్టు: మండల కేంద్రంలోని సోలార్ ప్రాజెక్టులో ఉద్యోగం చేస్తున్న కేటిదొడ్డి మండలం చింతలకుంటకు చెందిన లక్ష్మీరెడ్డి(46) శనివారం ఉదయం గుండెపోటుతో మృతి చెందాడు. చింతలకుంట చెందిన లక్ష్మీరెడ్డి మూడేళ్లుగా ఇందులో ఉద్యోగం చేస్తున్నాడు. రోజు వారీగా ఉదయం 6 గంటలకు విధులకు హాజరయ్యాడు. అరగంటకే అనారోగ్యానికి గురి కాగా, మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి చేరుకుని వైద్యం చేయించుకున్నాడు. అనంతరం మళ్లీ విధులకు హాజరుకాగా, కొద్ది సేపటికే గుండె పోటుకు గురై అక్కడే కుప్పకూలినట్లు తోటి ఉద్యోగులు తెలిపారు. వైద్యం కోసం గద్వాలకు ఆస్పత్రికి తరలించినప్పటికీ అప్పటికే మృతి చెందాడు. మృతునికి భార్య జ్యోతితో పాటుగా కుమార్తె ఉన్నారు. బాధిత కుటుంబానికి సోలార్ ప్రాజెక్టు నిర్వాహకులు ఆర్థిక సహాయం అందించి ఆదుకోవాలని కుటుంబ సభ్యులు, చింతలకుంట గ్రామస్తులు ఆందోళనకు దిగారు. ఆర్థిక సాయాన్ని అంగీకరించడంతో ఆందోళన విరమించారు.

బైక్ అదుపుతప్పి వ్యక్తి మృతి

కోడేరు: బైక్ అదుపు తప్పి వ్యక్తి మృతిచెందిన సంఘటన మండల కేంద్రంలో శనివారం చోటు చేసుకుంది. ఎస్ఐ నరేందర్‌రెడ్డి తెలిపిన వివరాలు ఇలా.. మండల కేంద్రంలోని ఊరగుట్టకు చెందిన మైబూస్(40) పంచాయతీలో పారిశుద్ధ్య కార్మికుడిగా పని చేస్తున్నాడు. పెద్దకొత్తపల్లికి వెళ్లి తిరిగి సాయంత్రం వస్తుండగా కోడేరు శివారులో బైక్ అదుపు తప్పి కిందపడి మృతి చెందాడు. మృతునికి భార్య లక్ష్మి, ఇద్దరు కుమారులు ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పోక్సో కేసు నమోదు

నాగర్‌కర్నూల్ క్రైం: బాలికకు మాయమాటలు చెప్పి లైంగికదాడికి పాల్పడిన సంఘటన జిల్లా కేంద్రంలో చోటు చేసుకోగా ఆలస్యంగా శనివారం వెలుగులోకి వచ్చింది. ఎస్ఐ విజయ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లా కేంద్రంలోని శ్రీపురం రోడ్డులో కళ్లద్దాల దుకాణాన్ని నిర్వహిస్తున్న శివప్రసాద్ నియోజకవర్గంలోని ఓ గ్రామానికి చెందిన బాలికకు మాయమాటలు చెప్పి లైంగికదాడికి పాల్పడ్డాడు. బాలిక అస్వస్థతకు గురి కావడంతో తల్లిదండ్రులు ఆరా తీయడంతో విషయం వెలుగులోకి వచ్చింది. తండ్రి స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో ఎస్ఐ నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

నిప్పంటుకుని మహిళకు తీవ్రగాయాలు

మరికల్: మండలంలోని మాధవారం చెందిన అంజమ్మ తన వ్యవసాయ పొలం వద్ద శనివారం సాయంత్రం కందికట్టెకు నిప్పు పెట్టింది. ప్రమాదవశాత్తు చీరకు నిప్పంటుకోవడంతో తీవ్రంగా గాయపడింది. వెంటనే చికిత్స నిమిత్తం ఆమెను జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ అశోక్ బాబు తెలిపారు.

బ్యాంకు ఖాతా నుంచి డబ్బులు మాయం

గద్వాల క్రైం: వ్యక్తిగత బ్యాంకు ఖాతా నుంచి నగదు మాయమైన సంఘటన పట్టణ పోలీసు స్టేషన్‌లో చోటు చేసుకుంది. ఎస్ఐ అబ్దుల్‌షుకుర్ తెలిపిన వివరాలు ఇలా.. పట్టణానికి చెందిన గోకుల్‌కు శనివారం ఉదయం తన ఫోన్‌కు బ్యాంకు ఖాతాకు పాన్‌కార్డు అప్‌డేట్ చేయాల్సిందిగా మెసేజ్ వచ్చింది. ఆయన పాన్‌కార్డు అప్‌డేట్ చేసి ఓటీపీ నమోదు చేశాడు. తన బ్యాంకు ఖాతా నుంచి రూ.52వేలు డ్రా అయినట్లు మెసేజ్ వచ్చింది. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

హైనా దాడిలో దూడ మృతి

వెల్దండ: మండలంలోని కేస్లీతండాలో రైతు మెగావత్ అమర్‌సింగ్ చెందిన ఆవు దూడను శనివారం తెల్లవారుజామున హైనా దాడి చేయడంతో మృతి చెందింది. రాత్రి షెడ్‌లో దూడను, ఆవును వేర్వేరుగా కట్టేసి వచ్చారు. ఉదయం పాల కోసం రైతు వెళ్లే సరికి దూడ మృతి చెందింది. ఘటన తీరును బట్టి హైనా దాడి చేసినట్లు ఫారెస్టు అధికారులు తెలిపారు.

ముగుస్తున్న పదవీకాలం

- మరోసారి అవకాశం ఇవ్వాలని కోరుతున్న జోగుళాంబ ఆలయ పాలక మండలి
- ఇంకో మూడు వారాలే గడువు



జోగుళాంబ శక్తిపీఠం: అష్టాదశ శక్తిపీఠాలలో ఐదవ శక్తిపీఠమైన అలంపూర్ జోగుళాంబ బాలబ్రహ్మేశ్వర స్వామి ఆలయ పాలక మండలి పదవీకాలం ఈ నెల చివరికి ముగియనుంది. గతేడాది మార్చి 29వ తేదీన చైర్మన్ బెక్కం శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో 18 మంది పాలకమండలి సభ్యులుగా ప్రమాణ స్వీకారం చేశారు. ప్రస్తుతం మరో మూడు వారాల్లో వీరి పదవీకాలం ముగియనుంది. గత పాలకులు ఎవరూ చేయని అభివృద్ధిని ప్రస్తుత పాలక మండలి చేసి భక్తుల మన్ననలు పొందారు. గతేడాది పాలకమండలి, అర్చకులు, సిబ్బంది మధ్య బేధాభిప్రాయాలతో తరచూ ఒకరిపై మరొకరు ఆరోపణలకు దిగుతూ ఆలయాలను అబాసుపాలు చేశారు. కాగా ప్రస్తుత పాలకమండలి ఎక్కడా వివాదాలకు తావివ్వలేదు.

చేసిన అభివృద్ధి పనులు..

చైర్మన్, ఆలయ ఈఓ పురేందర్ పరస్పర సహకారంలో పాత ఆస్పత్రి భవన స్థలాన్ని దేవస్థానంకు స్వాధీనం చేసుకోగలిగారు. రూ.కోటితో నిర్మించిన వసతిగదులను ప్రారంభించారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిని ఆలయాలకు తీసుకొచ్చి ఇక్కడి ఇబ్బందులను వారికి తెలియజేసి సమస్యలను కేంద్రం దృష్టికి తీసుకెళ్లారు. దేవీ నవరాత్రులు, మహా శివరాత్రి, అమ్మవారి వార్షిక బ్రహ్మోత్సవాలను గతంలో ఎన్నడూ లేని విధంగా సౌకర్యాలను కల్పిస్తూ విజయవంతం చేశారు. బెంగుళూరు కేంద్రంగా జోగుళాంబ ఆలయానికి అంతర్జాతీయ అవార్డును తీసుకొచ్చారు. అలంపూర్‌చౌరస్తా నుంచి ఆలయాల వరకు నాలుగు ఆర్చిగేట్ల నిర్మాణం కోసం అనుమతులు తెచ్చారు. ప్రతి రోజు 500 మందికి నిత్యాన్నదానం, అన్నదాన సత్ర భవన నిర్మాణాలకు రూ.80 లక్షల ప్రతిపాదనలను సిద్ధం చేసి ఆలయంపై ఆర్థిక భారం పడకుండా దాతలను ముందుకు తీసుకొచ్చారు. ఈ పాలక మండలిలో రూ.1,25,11,116 బ్యాంకులో ఎఫ్‌డీ చేశారు.

ఏడాది కాలపరిమితి తక్కువ



శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని అమ్మవారి సాక్షిగా ప్రమాణం చేశాను. ఒక్క రోజు కూడా వృథా చేయకుండా అనేక అభివృద్ధి పనులు చేశాం. ఏడాది కాలం చాలా తక్కువ. ఉమా మహేశ్వరం దేవస్థానంలో చైర్మన్‌కు 4 ఏళ్లుగా వరుసగా అవకాశం ఇచ్చారు. అదే తరహాలో మాకు మరోసారి అవకాశం ఇస్తే మరింత అభివృద్ధి చేసి అమ్మవారి రుణం తీర్చుకుంటాం.
– బెక్కం శ్రీనివాస్‌రెడ్డి, ఆలయ చైర్మన్

రూ.630కోట్లతో విద్యుత్ మౌలిక సదుపాయాలు

వ్యవసాయశాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి

వనపర్తి: ఒక్క వనపర్తి జిల్లాలోనే గడిచిన 9ఏళ్లలో విద్యుత్ మౌలిక సదుపాయాల కోసం ప్రభుత్వం రూ.630 కోట్ల నిధులు ఖర్చు చేసిందని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, టీఎస్‌పీడీసీఎస్ సీఎండీ రఘుమారెడ్డి వెల్లడించారు. శనివారం హైదరాబాద్‌లోని మంత్రి నివాసంలో విద్యుత్‌శాఖ జిల్లా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. తాజాగా జిల్లాకు రూ.34.16 కోట్లతో 36 కొత్త 33/11 సబ్ స్టేషన్లు, 58 పవర్ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. రూ.137.70 కోట్ల వ్యయంతో 12,831 వ్యవసాయ విద్యుత్ కోసం ట్రాన్స్‌ఫార్మర్లు బిగించనున్నారు. తొమ్మిదేళ్లలో జిల్లా వ్యాప్తంగా 29,428 వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు మంజూరు చేసినట్లు తెలిపారు. విద్యుత్ సరఫరా వ్యవస్థను బలోపేతం చేయడంతోనే డిమాండ్ పెరిగినా, సరఫరా చేయటం సాధ్యమవుతుందని తెలిపారు. రాష్ట్రం ఏర్పాటైన తొలినాళ్లలో 6,500 మెగావాట్లు ఉన్న విద్యుత్ డిమాండ్ ప్రస్తుతం 15వేల మెగావాట్లకు పెరిగిందన్నారు.

15రోజుల్లో భూసేకరణ పూర్తి చేయాలి

నెట్టెంపాడు, గట్టు ఎత్తిపోతల భూసేకరణ 15రోజుల్లో పూర్తి చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు. శనివారం మంత్రి హైదరాబాద్‌లోని తన నివాసంలో వనపర్తి, నాగర్‌కర్నూల్, జోగుళాంబ గద్వాల జిల్లా ఇరిగేషన్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. భీమా 27 ప్యాకేజీ 19 పరిధిలో అవసరాన్ని బట్టి వెంటనే నీటిని విడుదల చేయాలని, కొల్లాపూర్ నియోజకవర్గంలో చివరి ఆయకట్టుకు సాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించారు. వనపర్తి మండలంలోని సవాయిగూడెం బ్రాంచ్ కెనాల్, ఘణపురం, బుద్దారం రిజర్వాయర్ల టెండర్ల ప్రక్రియ వేగవంతం చేయాలన్నారు. చెక్ డ్యాంల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని, ఘణపురం బ్రాంచ్ కెనాల్‌పై అసంపూర్తి పనులు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. సమీక్షలో గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే చల్లా వెంకట్రామ్‌రెడ్డి, గట్టు తిమ్మప్ప, సీఈ రఘునాథ్‌రావు, ఎస్ఈలు సత్యశీలారెడ్డి, శ్రీనివాసరావు, ఈఈలు మధుసూదన్, సురేష్, డీఈలు, ఏఈలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మంత్రి నిరంజన్‌రెడ్డి. చిత్రంలో ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి, గట్టు తిమ్మప్ప, చల్లా వెంకట్రామిరెడ్డి తదితరులు

డ్రంకెన్‌డ్రైవ్‌లో ఇద్దరికి జైలుశిక్ష

9 మందికి జరిమానా

మహబూబ్‌నగర్ క్రైం: డ్రంకెన్‌డ్రైవ్‌లో పట్టుబడిన వాహనదారులను కోర్టులో హాజరుపరచగా ఇద్దరికి జైలు శిక్ష, జరిమాన విధిస్తూ తీర్పు ఇచ్చారు. ట్రాఫిక్ పోలీసులు పట్టణంలో ఇటీవల నిర్వహించిన డ్రంకన్ డ్రైవ్ తనిఖీలో 11మంది ద్విచక్ర వాహనదారులు పట్టుబడ్డారు. వారిని శనివారం జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి నిర్మలా 9మందికి రూ.2,500 చొప్పున ఒక్కొక్రికి జరిమానా విధించగా, ఒకరికి మూడు రోజుల జైలు శిక్ష, రూ.2,500జరిమానా, మరో వాహనదారుడికి రెండు రోజుల జైలు శిక్ష, రూ.2వేల జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చారు. జైలు శిక్షపడిన వాహనదారులను జిల్లా జైలుకు తరలించారు.

చోరీలకు పాల్పడుతున్న ఇద్దరి అరెస్ట్

గద్వాల క్రైం: ఇళ్లలో చోరీలకు పాల్పడి తప్పించుకు తిరుగుతున్న ఇద్దరిని అదుపులోకి తీసుకున్నట్లు రూరల్ ఎస్ఐ ఆనంద్ శనివారం తెలిపారు. గద్వాల మండల శివారులోని శివారులోని గద్వాల – ఎర్రవల్లి రోడ్డు మార్గంలో శనివారం సాయంత్రం వాహనల తనిఖీ చేపడుతుండగా, ఇద్దరు యువకులు అనుమానస్పదంగా తిరుగుతూ కనిపించడంతో పట్టుకుని విచారించారు. దీంతో ఇటిక్యాల మండల పరిధిలోని పలు ఇళ్లలో చోరీలకు పాల్పడినట్లు నేరం అంగీకరించారన్నారు. నిందితులు ఇటిక్యాల మండలం ఉదండాపురం చెందిన అశోక్‌రెడ్డి, యోగేష్‌కుమార్‌గా గుర్తించామన్నారు. వారి నుంచి 5.6 తులాల బంగారం స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.

వణికిస్తున్న జ్వరాలు


మహబూబ్‌నగర్ జనరల్ ఆస్పత్రిలో రోగుల రద్దీ

- జనరల్ ఆస్పత్రిలో పెరుగుతున్న రోగుల రద్దీ
- 11 రోజుల్లో ఫీవర్, దగ్గు, జలుబుతో 425 మంది చేరిక
- ప్రైవేట్ ఆస్పత్రుల్లో రెట్టింపు స్థాయిలో కేసులు
- బాధితుల్లో చిన్నారులే అధికం

పాలమూరు: వాతావరణంలో వస్తున్న మార్పుల కారణంగా తగ్గని జ్వరం, దగ్గు.. తోడుగా ఇతర శ్వాసకోశ సమస్యలతో మహబూబ్‌నగర్ జనరల్ ఆస్పత్రికి వచ్చే రోగుల సంఖ్య క్రమంగా పెరుగుతోంది. కరోనా వైరస్‌తో సుదీర్ఘ పోరాటం చేసిన ప్రజలు ఇప్పుడిప్పుడే ఊపిరి పీల్చుకుంటుండగా.. అవే లక్షణాలతో వస్తున్న జబ్బులు ప్రజలను భయాందోళనకు గురిచేస్తోంది. వచ్చిన సమస్య తగ్గడానికి సాధారణం కంటే ఎక్కువ రోజులు పడుతుండటంతో ఇది ఇన్‌ఫ్లుయెంజా హెచ్3 ఎన్2 వైరస్ కారణమై ఉండవచ్చునని కొందరు అనుమానిస్తున్నారు. దేశవ్యాప్తంగా ఇన్‌ఫ్లుయెంజా పంజా విసురుతుండగా కేంద్ర ప్రభుత్వం ప్రజలను అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించిన నేపథ్యంలో మహబూబ్‌నగర్ ప్రభుత్వ ఆస్పత్రికి ఈ రకమైన వ్యాధి లక్షణాలతో వచ్చే వారి సంఖ్య పెరుగుతోంది. ప్రతిరోజు ఓపీ 2 వేల నుంచి 2,200 మంది చికిత్స కోసం వస్తున్నారు. ఇందులో 80 శాతం వైరల్ ఫీవర్, దగ్గు, జలుబు సమస్యతో వచ్చేవారు ఉంటున్నారు.

లక్షణాలు ఇవే..

చలికాలం నుంచి వేసవికి మారుతున్న కాలంలో వచ్చే వాతావరణ మార్పులతో జ్వరంతోపాటు దగ్గు, వికారం, వాంతులు, గొంతునొప్పి, ఒళ్లు నొప్పులు, కొన్ని సందర్భాల్లో అతిసారం వంటి లక్షణాలు కనిపిస్తున్నాయి. వీరిలో ఇన్‌ఫెక్షన్ ఐదు నుంచి వారం రోజుల పాటు ఉంటుంది. జ్వరం మూడు రోజుల్లో తగ్గుతుంటే దగ్గు మాత్రం మూడు వారాలకుపైగా ఉంటుందని రోగులు చెబుతున్నారు.

జాగ్రత్తలు పాటించాలి..



కరోనా సమయంలో పాటించిన విధంగా మాస్కులు ధరించడం, చేతులు శుభ్రం చేసుకోవాలి. ముక్కు, నోరుకు దగ్గరగా చేతులు తీసుకెళ్లకూడదు. వైద్యుల సూచన మేరకు చికిత్స తీసుకోవాలి. ప్రధానంగా ఈ లక్షణాలు ఉన్న పిల్లలు, పెద్దలు ఎవరైనా మూడు రోజుల వరకు యాంటీబయాటిక్స్ తీసుకోరాదు. మిటిషన్, దోమలు అధికంగా వృద్ధి చెందడం వల్ల ఫ్లూ జ్వరాలు వస్తున్నాయి. ఇమ్యూనిటీ పెంచుకోవడానికి బలమైన ఆహారం తీసుకోవాలి.
– డాక్టర్ బాలశ్రీనివాస్, జనరల్ ఆస్పత్రి

కేసులు రాలేదు..



ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో ఇప్పటి వరకు ఇన్‌ఫ్లుయెంజా హెచ్ 3 ఎన్2 పాజిటివ్ కేసులు నమోదు కాలేదు. అధికంగా వైరల్ ఫ్లూ వల్ల జ్వరం, దగ్గు, జలుబు కేసులు వస్తున్నాయి. గర్భిణులతో అర్థో సమస్యలతో వచ్చేవారికి సైతం జలుబు, దగ్గు ఉంటున్నాయి. వారంరోజుల్లో దాదాపు ఫ్లూ లక్షణాలున్న రోగులు చేరారు. అందులో పెద్దల కంటే పిల్లలు అధికంగా ఉన్నారు. వాతావరణ మార్పుల కారణంగా వైరల్ ఫీవర్స్ పెరిగాయి. ప్రభుత్వ ఆస్పత్రిలో 500 ఆక్సిజన్ పడకలు అందుబాటులో ఉన్నాయి.
– రామకిషన్, జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్

ప్రైవేట్‌లో రెట్టింపు

మహబూబ్‌నగర్‌లోని ప్రైవేట్ ఆస్పత్రుల్లో ప్రధానంగా చిన్నపిల్లల ఆస్పత్రులు, జనరల్ మెడిసిన్‌కు సంబంధించిన వాటిలో రద్దీ తీవ్రంగా కనిపిస్తోంది. జ్వరం, దగ్గు, జలుబు ఇతర సమస్యలతో అడ్మిట్ అవుతున్న వారు పెరిగారు. మధ్య తరగతి నుంచి ఆపై వారు అధికంగా ప్రైవేట్‌ను ఆశ్రయిస్తుంటారు. ఉదయం, సాయంత్రం వేళలో అయితే కాలనీల్లో ఉండే చిన్నపాటి క్లినిక్‌లు సైతం చిన్నారులతో రద్దీగా ఉంటున్నాయి. ఇక ప్రైవేట్ ల్యాబ్‌లలో రక్త పరీక్షల కోసం జనం క్యూ కడుతున్నారు.

ఈ ఏడాది జనరల్ ఆస్పత్రిలో చేరిన వారి వివరాలు ఇలా..

నెల	పెద్దలు	చిన్నారులు	పీఐసీయూ	గర్భిణులు
జనవరి	430	325	65	15
ఫిబ్రవరి	565	286	50	18
మార్చి	205	165	35	20



ప్రణాళిక లోపం..


ఫేజ్-3లో పిల్లర్ల కోసం తీసిన గుంతల్లో నిలిచిన నీరు

- 4ఏళ్లు అవుతున్న పూర్తికాని షాపింగ్ కాంప్లెక్స్
- నిధుల్లేక నిలిచిన పనులు


ఫేజ్ -1లో పిల్లర్ల వరకు..

దేవరకద్ర రూరల్: పట్టణంలోని ఈశ్వర వీరప్పయ్య స్వామి షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణ పనులను సరైన ప్రణాళిక లేకుండా చేపట్టడంతో ముందుకు సాగడం లేదు. కాంప్లెక్స్ నిర్మాణం కోసం రూ. 2.16 కోట్లు చెల్లించి నాలుగేళ్లవుతున్న పనులు పూర్తి కాకపోవడంతో డబ్బులు డిపాజిట్ చేసిన లబ్ధిదారులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.

54షాపుల నిర్మాణానికి అనుమతి

దేవాదాయ శాఖ పరిధిలో ఉన్న ఈశ్వర వీరప్పయ్య స్వామి దేవస్థానానికి సర్వే నంబర్ 541లో 16.19 ఎకరాల భూమి ఉంది. అందులో షాపింగ్ కాంప్లెక్స్‌ను నిర్మిస్తే ఆదాయంతో పాటు ఆలయభివృద్ధికి తోడ్పాటు అందించాలనే ఉద్దేశంతో 2016లో అధికారులు, ఆలయ చైర్మన్ ఉన్నతాధికారులకు నివేదించారు. 2019లో ఎండోమెంట్ కార్యాలయం నుంచి షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి అనుమతి ఇచ్చారు. దీంతో మొత్తం మూడు బ్లాకులుగా విభజించి 54 షాపులు నిర్మించాలని నిర్ణయించారు. అలాగే డిప్ ద్వారా ఎంపికైనా లబ్ధిదారుల నుంచి ఒకో దుకాణం రూ.4 లక్షల చొప్పున మొత్తం రూ. 2కోట్ల16 లక్షలను దేవస్థానం పేరిట డీడీల రూపంలో తీసుకున్నారు. ఈ డబ్బులతో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం సంవత్సరంలో పూర్తి చేసి, నాలుగు ఏళ్లకు లీజుకు ఇస్తామని అధికారులు హామీ ఇచ్చారు. దీంతో జీవనోపాధి లభిస్తుంది అనే ఉద్దేశంతో అప్పులు చేసి మరీ డబ్బులు చెల్లించారు.

నిధుల లేమి..


2019లో లబ్ధిదారుల నుంచి తీసుకున్న డబ్బులను ఓ కాంట్రాక్టర్‌కు అప్పగించారు. పనులను దక్కించుకున్న కాంట్రాక్టర్ వివిధ కారణాలతో దాదాపు రెండేళ్ల వరకు ప్రారంభించలేదు. దీంతో లబ్ధిదారులు స్థానిక ఎమ్మెల్యేను ఆశ్రయించారు. ఎమ్మెల్యే అధికారులు, కాంట్రాక్టర్‌తో సమావేశమై పనులను ప్రారంభించాలని ఆదేశించారు. దీంతో ప్రారంభించిన పనులు ఆగుతూ సాగాయి. ప్రస్తుతం ఫేజ్-1లో 17 షాపులు బేస్‌మెంట్ వరకు, ఫేజ్-2లో 20 షాపులు స్లాబ్ వరకు, ఫేస్-3లో 17 షాపులకు కొన్ని పిల్లర్ల వరకు, మిగతావి ఇంకా ప్రారంభ దశలో ఉన్నాయి. అప్పటి వరకు పనులను నిర్వహించిన కాంట్రాక్టర్ మధ్యలోనే వదిలేసి వెళ్లిపోయాడు. ఆలయ పాత పాలకవర్గం సమయం అయిపోవడంతో ఐదు నెలల క్రితం కొత్త పాలకవర్గం కొలువుతీరింది. లబ్ధిదారుల నుంచి కాంప్లెక్స్ పనులకు సంబంధించిన ఒత్తిళ్లు రావడంతో బ్యాంకుకు వెళ్లి ఆరా తీయగా రూ.2.16 కోట్ల నుంచి బిల్లులు చెల్లింపులు పోను ప్రస్తుతం బ్యాంకు ఖాతాలో రూ. 54 లక్షలు మాత్రమే ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. మిగిలిన పనులు పూర్తి చేయాలంటే ఇంకా రూ 1.50 కోట్లు అవుతాయని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ డబ్బులను ఎవరు భరిస్తారు అనేది ప్రస్తుతం ప్రశ్నార్థకంగా మారింది.

వడ్డీ కట్టలేకపోతున్నాం




రహదారికి సమీపంలో చిన్నపాటి షాపు దొరికిన బ్రతుకులు మారుతాయనే ఆశతో అప్పులు చేసి మరి డిపాజిట్ డబ్బులు చెల్లించాం. 4 ఏళ్లు అవుతున్న పనులు పూర్తి కావడం లేదు. తీసుకువచ్చిన డబ్బులకు వడ్డీ కట్టలేక పోతున్నాం. అధికారులు, పాలకులు స్పందించి పనులను పూర్తి చేయాలి.
– గౌని శ్రీను, లబ్ధిదారుడు, దేవరకద్ర

స్పష్టత లేదు



పనులను సకాలంలో పూర్తి చేయకపోవడంతో అంచనా వ్యయం పెరిగింది. ఉన్న నిధులతో కాంప్లెక్స్ పనులు పూర్తి కావు. ఇప్పటి వరకు చేపట్టిన పనుల్లో నాణ్యత లేకపోవడంతో నిర్మాణంలో పగుళ్లు వచ్చాయి. ఈ విషయంపై ఇప్పటికే అధికారులకు, పాలకులకు విన్నవించుకున్నా ఫలితం లేదు.
– రాజు, లబ్ధిదారుడు, దేవరకద్ర

ప్రభుత్వానికి నివేదించాం



వీరప్పయ్య కాంప్లెక్స్ నిర్మాణానికి సరైన ప్రణాళిక లేకుండా చేపట్టడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఇంజినీరింగ్ సలహా లేకుండా, ప్రారంభ దశలో భూమి యొక్క సామర్థ్యంను పరిశీలించకుండానే చేపట్టిన పనులు నెమ్మదిగా కొనసాగాయి. ప్రస్తుతం పెరిగిన ధరలతో అంచాన వ్యయం పెరిగింది. సమస్యను ప్రభుత్వంకు నివేదించాం. అనుమతి రాగానే మిగిలిన పనులు పూర్తి చేయడంపై స్పష్టతను ఇస్తాం.
– కోమల్, దేవాలయ ఇన్‌చార్జ్ ఈఓ

క్లుప్తంగా...

నేను ఒక్క కాపులకే నాయకుడిని కాదు

- బీసీలకు అధికారం రావాలని పంతం పట్టా: పవన్‌కల్యాణ్



సాక్షి, అమరావతి: తాను ఒక్క కాపులకే నాయకుడ్ని కాదని, ఒక కులం పరిధిలోనే ఆలోచించేలా పెరగలేదని జనసేన పార్టీ అధినేత పవన్‌కల్యాణ్ చెప్పారు. శనివారం మంగళగిరిలోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో జరిగిన బీసీ నేతల సమావేశంలో ఆయన ప్రసంగించారు. సమావేశంలో కొందరు నాయకులు కాపులకు రిజర్వేషన్లు అమలు చేయాల్సిన అవసరమేంటని మాట్లాడటంపై ఆయన స్పందిస్తూ.. ఈ అంశాన్ని కాపుల నేతలతో సమావేశమైనప్పుడు వారి దృష్టికి తీసుకెళతానని చెప్పారు. బీసీలు ఎన్నికలప్పుడు రూ. 2 వేలకు ఓటును అమ్ముకుంటున్నారంటే వారికి ఆత్మాభిమానం లేక కాదని, ఆర్థిక పరిపుష్టి లేక అలా చేస్తున్నారని పవన్ అన్నా రు. బీసీలకు ఆర్థిక పరిపుష్టి ఏర్పడాలని, అందుకోసం ఆ కులాలకు అండగా ఉంటానని అ న్నారు. 'బీసీలకు అధికారం రావాలని నేను పంతం పట్టా. బీసీలతో కలిసి అధికారం పంచుకోవాలని కాపు నాయకులకూ చెబుతా' అని అన్నారు. ఎన్నికల సమయంలో బీసీలు కులాల వారీగా విడిపోకుండా బీసీ అభ్యర్థిని అందరూ కలిసి ఎందుకు గెలిపించుకోరని ప్రశ్నించారు. బీసీల సమస్యలపై ఒక రోజు రాష్ట బంద్‌కు పిలుపునిస్తే తాను అండగా ఉంటానని, లేదంటే ఒక్క రోజు దీక్ష చేద్దామని చెప్పారు.

కాపులంతా కాపు సంక్షేమ సేనలో లేరు

పవన్ కల్యాణ్‌కు కాపు ఐక్య వేదిక బహిరంగ లేఖ

సాక్షి, అమరావతి: రాజకీయాల నుంచి పూర్తిగా వైదొలగి, 80 ఏళ్ల వయస్సులో కాపు సంక్షేమ సేనను స్థాపించిన చేగొండి హరిరామ జోగయ్య భ్రాంతి నుంచి జనసేన బయట పడాలని కాపు ఐక్య వేదిక సూచించింది. కాపులంతా కాపు సంక్షేమ సేనలో లేరని స్పష్టం చేసింది. ఈ మేరకు జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్‌కు కాపు ఐక్య వేదిక రాష్ట్ర చైర్మన్ రావి శ్రీనివాస్ తదితరులు శనివారం బహిరంగ లేఖ రాశారు. 'జోగయ్యను నమ్మి చిరంజీవి పాలకొల్లులో ఓడిపోయారు. బీసీ, దళిత నాయకులను కలుస్తున్నట్టే కాపు సంఘాల నాయకులను మీరు ఎందుకు కలవడంలేదు? కాపు సంఘాల నాయకులను కలిస్తే కులం కార్డు వచ్చేస్తుందని భావిస్తే.. జోగయ్య నేతృత్వంలోని కాపు సంక్షేమ సేనను కలవడం వల్ల కులం కార్డు రాదా' అని కాపు ఐక్య వేదిక నేతలు ఆ లేఖలో పవన్‌ను ప్రశ్నించారు.

'లిక్కర్ ఆదాయం ద్వారానే రాష్ట్ర పాలన'

బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ



గద్వాల: రాష్ట్రంలో ప్రజావ్యతిరేక విధానాలను అవలంభిస్తు, అవినీతికి పాల్పడుతున్న బీఆర్‌ఎస్ సర్కార్‌ను గద్దె దించేందుకు ప్రజలు సిద్ధం కావాలని బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ పిలుపునిచ్చారు. శనివారం జిల్లా కేంద్రంలో పార్టీ కార్యాలయంలో 'ప్రజా గోస– బీజేపీ భరోసా' పేరుతో గత నెల చేపట్టిన కార్నర్ మీటింగ్‌లను విజయవంతం చేసిన శక్తి కేంద్రాల ఇన్‌చార్జ్‌లు, పార్టీ నాయకులకు సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రజలను మభ్యపెట్టి మోసపూరిత వాగ్దానాలతో అధికారంలోకి వచ్చిన ముఖ్యమంత్రి కేసీఆర్ అన్ని వర్గాల ప్రజలకు అన్యాయం చేస్తున్నాడన్నారు. మద్యం కుంభకోణంలో కూరుకుపోయిన కవిత మహిళా రిజర్వేషన్ల గురించి మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందన్నారు. రాష్ట్రంలో లిక్కర్ ఆదాయం ద్వారానే పాలన సాగుతుందని చెప్పారు. ఏడాదికి లిక్కర్ ద్వారా రూ.40 వేల కోట్లు ఆదాయం రాష్ట్రానికి వస్తుందని తెలిపారు. లిక్కర్ ధరల పెంపుపై ఉన్న శ్రద్ధ ప్రజల ఆరోగ్యంపై చూపడం లేదని ధ్వజమెత్తారు. గ్యాస్ సిలిండర్ ధరల పెంపుపై నానా యాగి చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు కరెంటు, ఆర్టీసీ, రిజిస్ట్రేషన్, లిక్కర్ ధరల పెంపుపై ఎందుకు ప్రశ్నించడం లేదని అన్నారు. ఎర్రవల్లి చౌరస్తా నుంచి గద్వాల మీదుగా రాయచూర్‌కు జాతీయ రహదారిని ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వానికి విన్నవించిన విషయాన్ని ఆమె గుర్తుచేశారు. డబుల్ ఇంజన్ సర్కార్‌తోనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందన్నారు. అనంతరం గట్టు మండలానికి చెందిన పలువురు నాయకులు పార్టీలో చేరారు. సమావేశంలో గడ్డం కృష్ణారెడ్డి, రామాంజనేయులు, బండల వెంకట్రాములు, వెంకటేశ్వర్ రెడ్డి, కౌన్సిలర్ త్యాగరాజు, శివారెడ్డి, రాజేష్, శ్రీనివాస్‌గౌడ్, రాజశేఖర్‌రెడ్డి, శ్యామ్, మురేందర్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

తోడు దొంగలు

► మొదటి పేజీ తరువాయి

రిజిస్ట్రేషన్ల శాఖ గత ఏడాది అక్టోబర్, నవంబర్ నెలల్లో సోదాలు నిర్వహించింది. రిజర్వ్ బ్యాంక్ నిబంధనలు, చిట్ ఫండ్ చట్టానికి విరుద్ధంగా ఆ సంస్థ అక్రమాలకు పాల్పడుతున్నట్టు గుర్తించింది. ఆ తనిఖీల్లో మార్గదర్శి చిట్ ఫండ్స్ బ్రాంచి మేనేజర్లు స్టాంపులు–రిజిస్ట్రేషన్ల శాఖ అధికారులకు ఏమాత్రం సహకరించ లేదు. దాంతో అధికారులు హైదరాబాద్‌లోని ప్రధాన కార్యాలయంలో గత ఏడాది డిసెంబర్‌లో తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో మరిన్ని అక్రమాలు వెలుగు చూశాయి. చట్టాలను యథేచ్ఛగా ఉల్లంఘిస్తూ చందాదారుల హక్కులకు విఘాతం కలిగిస్తున్నారని ఆధారాలతో సహా నిర్ధారించారు. సంస్థ యాజమాన్యం తమ స్వప్రయోజనాల కోసం అక్రమాలకు పాల్పడుతోందని నిగ్గు తేల్చారు. దాంతో చందాదారుల హక్కుల పరిరక్షణ, రిజర్వ్ బ్యాంక్ నిబంధనలను అమలు చేయడం కోసం ఈ వ్యవహారాన్ని సీఐడీకి నివేదించారు. విశాఖపట్నం, కాకినాడ, ఏలూరు, విజయవాడ, గుంటూరు, పల్నాడు, కర్నూలు, అనంతపురం జిల్లా అసిస్టెంట్ రిజిస్ట్రార్లు ఈ మేరకు సీఐడీకి లిఖిత పూర్వకంగా సీఐడీ విభాగానికి ఫిర్యాదు చేశారు. దాంతో మార్గదర్శి చిట్ ఫండ్స్‌పై సీఐడీ కేసు నమోదు చేసింది. సీఐడీ అధికారులు విశాఖపట్నం, రాజమహేంద్రవరం, ఏలూరు, విజయవాడ, గుంటూరు, నరసరావుపేట, అనంతపురంలోని మార్గదర్శి చిట్ ఫండ్స్ కార్యాలయాల్లో శనివారం సోదాలు నిర్వహించి మేనేజర్లను ప్రశ్నించారు. సోదాలు మొదలుపెట్టగానే నరసరావుపేట, ఏలూరు బ్రాంచి మేనేజర్లు పరారవ్వడం గమనార్హం. ఈ సోదాల్లో సీఐడీ అధికారులు కీలక పత్రాలను స్వాధీనం చేసుకున్నారు. ఆదివారం కూడా సోదాలు కొనసాగించనున్నారు.

రికార్డుల నిర్వహణలో గూడు పుఠాణి

- మార్గదర్శి చిట్‌ఫండ్స్ కార్యాలయాల్లో తాము గుర్తించిన అక్రమాలపై స్టాంప్స్– రిజిస్ట్రేషన్ల శాఖ అధికారులు మరింత లోతుగా పరిశీలించారు. మార్గదర్శి సంస్థ సమర్పించిన ఆర్థిక నివేదికల (ఫైనాన్సియల్ స్టేట్‌మెంట్స్)పరిశీలనకు ఓ చార్టడ్ అకౌంటెంట్‌ను నియమించడం ద్వారా పలు అక్రమాలను గుర్తించారు.
- చిట్టీల వారీగా లాభనష్టాల ఖాతా, బ్యాలెన్స్ షీట్‌లను సక్రమంగా నిర్వహించడం లేదు.
- బ్యాలన్స్ షీట్‌లో నోట్ నంబర్ 7 కింద రూ.459.98 కోట్లు చూపించారు. కానీ పరిశీలించగా ఆ మొత్తాన్ని నిబంధనలకు విరుద్ధంగా మ్యూచువల్ ఫండ్స్‌లో పెట్టుబడి పెట్టినట్టు నిర్ధారణ అయ్యింది.
- మార్గదర్శి చిట్‌ఫండ్స్ సంస్థకు మూడు అనుబంధ కంపెనీలు ఉన్నట్టుగా బ్యాలన్స్ షీట్ నోట్ నంబర్ 40లో పేర్కొన్నారు. మార్గదర్శి చిట్స్ ప్రైవేట్ లిమిటెడ్–చెన్నై, మార్గదర్శి చిట్స్ (కర్ణాటక) ప్రైవేట్ లిమిటెడ్–బెంగళూరు, ఉషా కిరణ్ మీడియా ప్రైవేట్ లిమిటెడ్–హైదరాబాద్‌లను అనుబంధ కంపెనీలుగా చూపించారు. నిధులను నిబంధనలకు విరుద్ధంగా తరలించేందుకే ఇలా చేశారు. మార్గదర్శి చిట్ ఫండ్స్ సంస్థ ఆ మూడు అనుబంధ కంపెనీల్లో రూ.1,05,80,000 పెట్టుబడి పెట్టినట్టు బ్యాలన్స్ షీట్‌లో చూపించారు. కానీ ఆ కంపెనీల షేర్ హోల్డర్స్ జాబితా పరిశీలించగా.. ఒక్క ఉషా కిరణ్ మీడియా ప్రైవేట్ లిమిటెడ్‌లోనే 88.5 శాతం వాటాతో రూ.2 కోట్లు పెయిడ్ అప్ క్యాపిటల్‌గా పెట్టుబడి పెట్టినట్టు నిర్ధారణ అయ్యింది.
- చిట్ ఫండ్ కంపెనీలు ఇతర వ్యాపారాల్లో పెట్టుబడి పెట్టడం చిట్ ఫండ్ చట్టం–1982కు విరుద్ధం. కానీ మార్గదర్శి చిట్‌ఫండ్స్‌కు ఉన్న మూడు అనుబంధ కంపెనీలు అదే తరహా వ్యాపారంలో ఉన్నట్టుగా చూపించారు. కానీ ఉషాకిరణ్ మీడియా ప్రైవేట్ లిమిటెడ్ చిట్‌ఫండ్ వ్యాపారంలో లేదు. ఇది నిబంధనలకు విరుద్ధం. ఆ కంపెనీలో మార్గదర్శి చిట్ ఫండ్స్ 88.5 శాతం వాటా ఉంది. అంటే ఆ కంపెనీలో నిర్ణయాధికారం మార్గదర్శి సంస్థదే.

అక్రమ డిపాజిట్లు

మార్గదర్శి ఫైనాన్షియర్స్ దశాబ్దాలుగా అక్రమ డిపాజిట్లు సేకరిస్తూ వచ్చింది. ఆ సంస్థ కార్యాలయాల్లోనే 'మార్గదర్శి డిపాజిట్స్' అనే పేరుతో భారీగా అక్రమ డిపాజిట్లను సేకరించింది. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రభుత్వ హయాంలో దీనిపై ఫిర్యాదు రావడంతో కేసు నమోదు చేశారు. అప్పట్లో రిజర్వ్ బ్యాంక్ ఈ విషయాన్ని తీవ్రంగా పరిగణించింది. దాంతో తాము తప్పు చేశామని రామోజీరావు లిఖిత పూర్వకంగా అంగీకరిస్తూ డిపాజిట్‌దారులకు వారి డిపాజిట్ మొత్తాలను వెనక్కి ఇచ్చేస్తున్నట్టు ప్రకటించారు. దాంతో మార్గదర్శి చిట్ ఫండ్స్ ఇక డిపాజిట్ల సేకరణను నిలిపి వేసిందని అంతా భావించారు. కానీ గుట్టుచప్పుడు కాకుండా ×రశీదు×ల రూపంలో అక్రమ డిపాజిట్లు వసూలు చేస్తున్నట్టుగా స్టాంప్స్–రిజిస్ట్రేషన్ల శాఖ ఇటీవల నిర్వహించిన తనిఖీల్లో బహిర్గతమైంది.



ఏలూరు మార్గదర్శి కార్యాలయంలో అధికారుల తనిఖీలు

మార్గదర్శి అక్రమాలు ఇవీ..

- చందాదారులు నెలవారీ మొత్తం చెల్లించకపోయినా, వాయిదాల మొత్తం చెల్లించకపోయినా ఆ ఖాతాలను మార్గదర్శి చిట్‌ఫండ్స్ పేరుతో చూపించారు. అనంతరం నిబంధనలకు విరుద్ధంగా ఆ చీటీలను ఇతర వ్యక్తుల పేరుతో మార్పు చేశారు. ఇది నిబంధనలకు విరుద్ధం.
- చందాదారులు పాడిన చిట్ మొత్తాన్ని వారికి వెంటనే చెల్లించడం లేదు. ఆ మొత్తంపై 4 శాతం నుంచి 5 శాతం వరకు చందాదారునికి వడ్డీ చెల్లిస్తామని చెబుతూ ఓ రశీదు ఇస్తున్నారు. అంటే మార్గదర్శి సంస్థ ఆ చిట్ మొత్తాన్ని డిపాజిట్‌గా స్వీకరిస్తున్నట్టే. ఇది రిజర్వ్ బ్యాంక్ నిబంధనలకు విరుద్ధం. చిట్ ఫండ్ కంపెనీలు డిపాజిట్లు స్వీకరించడాన్ని చట్టం నిషేధించింది. అయినప్పటికీ మార్గదర్శి చిట్ ఫండ్స్ సంస్థ నిబంధనలకు విరుద్ధంగా 'ప్రత్యేక రశీదు'ముసుగులో డిపాజిట్లు సేకరించింది.
- మార్గదర్శి చిట్‌ఫండ్స్ తమ ఆదాయ, వ్యయాల ఖాతాలు, ఆస్తి, అప్పుల నివేదికలు, పెట్టుబడుల నివేదికలను వెల్లడించకుండా గోప్యంగా ఉంచింది. ఇది చిట్ ఫండ్ చట్టంలోని సెక్షన్ 28 రెడ్‌విత్ 24 నిబంధనలకు విరుద్ధం.
- మార్గదర్శి చిట్ ఫండ్స్ కార్యాలయాల నుంచి భారీగా నిధులను మార్గదర్శి ప్రధాన కార్యాలయానికి బదిలీ చేశారు. ఆ నిధులను మార్గదర్శి యాజమాన్యం మార్కెట్ రిస్క్ అత్యధికంగా ఉండే మ్యూచువల్ ఫండ్స్‌లో పెట్టుబడిగా పెట్టింది. ఇది చిట్ ఫండ్ చట్టానికి విరుద్ధం.

నేడు వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవం

అన్ని నియోజకవర్గాల్లో పార్టీ జెండా ఎగురవేయాలని కేంద్ర కార్యాలయం పిలుపు

సాక్షి, అమరావతి: మార్చి 12న (నేడు) వైఎస్సార్ సీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని శాసనసభ్యులు, నియోజకవర్గ సమన్వయకర్తలు ఘనంగా నిర్వహించాలని ఆ పార్టీ కేంద్ర కార్యాలయం పిలుపునిచ్చింది. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేసింది. రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాలలో పార్టీ జెండాలు ఎగుర వేయాలని, దివంగత సీఎం డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాలకు రంగులు వేసి, పూలమాలలతో అలంకరించాలని తెలిపింది. పలు సేవా కార్యక్రమాలతో వేడుకలు ఘనంగా నిర్వహించాలని సూచించింది. వైఎస్సార్‌సీపీ 12 వసంతాలు పూర్తి చేసుకుని మార్చి 12వ తేదీన 13వ సంవత్సరంలోకి అడుగు పెట్టనుంది. పార్టీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో ఎన్నో సవాళ్లను అధిగమించి, సంపూర్ణ ప్రజా బలంతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన విషయం విదితమే. అధికారంలోకి వచ్చాక ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన దాదాపు అన్ని హామీలు అమలు చేయడమే కాక, చెప్పని వాటితో పాటు, అనేక సంక్షేమ – అభివృద్ధి కార్యక్రమాల అమలు ద్వారా ప్రజారంజక పరిపాలన సాగిస్తోంది.

ఆత్మగౌరవానికి ప్రతీక

- సవాళ్లనే సోపానాలుగా మల్చుకున్న వైఎస్సార్‌సీపీ
- 12 ఏళ్లలో తిరుగులేని శక్తిగా ఆవిర్భావం
- నేడు 13వ వసంతంలోకి అడుగులు
- విప్లవాత్మక కార్యక్రమాలతో వైఎస్ జగన్ ప్రజారంజక పాలన
- సంక్షేమాభివృద్ధి పథకాలతో రాష్ట్రం పరుగులు

మరిన్ని వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

మార్గదర్శి చిట్‌ఫండ్‌కు కమిషన్ వడ్డింపు

చిట్స్ మొత్తం చెల్లింపులో జాప్యం చేసినందుకు..


గుంటూరు లీగల్: చిట్స్‌కు సంబంధించిన వాయిదాల నగదును పూర్తిగా చెల్లించినప్పటికీ, ఆ చిట్స్ పూర్తయిన తరువాత ఆ మొత్తం చెల్లింపులో జాప్యం చేసినందుకుగానూ నష్టపరిహారం చెల్లించాల్సిందేనని మార్గదర్శి చిట్‌ఫండ్ ప్రైవేట్ లిమిటెడ్‌ను గుంటూరు జిల్లా వినియోగదారుల కమిషన్ ఇటీవల ఆదేశించింది. పల్నాడు జిల్లా దాచేపల్లి మండలం నారాయణపురం గ్రామానికి చెందిన సీహెచ్ సుబ్బారావు 2007 సెప్టెంబర్ 27న మార్గదర్శి చిట్‌ఫండ్‌లో రెండు చిట్స్‌కు చందాదారుడిగా చేరాడు. ఒక్కో చిట్ విలువు రూ.2,50,000. యాభై నెలల కాల వ్యవధి. సుబ్బారావు రెండు చిట్స్‌కు పూర్తిగా నగదు చెల్లించాడు. 2010 అక్టోబర్ 20న చిట్ కాలవ్యవధి పూర్తయింది. దీంతో సుబ్బారావు తన డబ్బులు కోసం మార్గదర్శి చిట్‌ఫండ్ కార్యాలయంలో సంప్రదించాడు. సాంకేతిక కారణాలవల్ల డబ్బులు చెల్లించలేకపోతున్నట్లు సిబ్బంది తెలిపారు. దాదాపు తొమ్మిదేళ్ల పాటు బాధితుడు కార్యాలయం చుట్టూ తిరిగినా ప్రయోజనం లేకపోయింది. అనంతరం బాధితుడి అకౌంట్‌లో నగదు జమచేసినట్లుగా 2019 నవంబర్ 2న రిజిస్టర్డ్ పోస్టు ద్వారా మార్గదర్శి సిబ్బంది తెలిపారు. తొమ్మిదేళ్ల తరువాత నగదు చెల్లించినందున ఆలస్యానికి నష్టపరిహారం చెల్లించాలని సుబ్బారావు కోరాడు. దీనికి తమ హెడ్డాఫీసు ఒప్పుకోవడంలేదని చిట్‌ఫండ్ సిబ్బంది తెలిపారు. సర్వీసు లోపం కింద నష్టపరిహారం ఇప్పించాలని ఫిర్యాదు సుబ్బారావు గుంటూరు జిల్లా వినియోగదారుల కమిషన్‌ను ఆశ్రయించాడు. అసలు కమిషన్‌కు ఈ కేసును విచారించే అధికార పరిధి లేదని 'మార్గదర్శి'వాదించగా కమిషన్ దానిని తిరస్కరించింది. 2010 నుంచి 2019 వరకు ఐదు లక్షలకు 12 శాతం వడ్డీ చెల్లించాలని, మానసికంగా హింసించినందుకుగానూ రూ.2 లక్షలు నష్టపరిహారం, కోర్టు ఖర్చులు కింద రూ.10 వేలు చెల్లించాలని మార్గదర్శి చిట్‌ఫండ్‌ను ఆదేశిస్తూ జిల్లా వినియోగదారుల కమిషన్ అధ్యక్షులు టి.సునీత, కమిషన్ సభ్యులు కె. విజయలక్ష్మి, గుంటకల పున్నారెడ్డి తీర్పు చెప్పారు.

అనాథ బాలలకు ప్రభుత్వ భరోసా

ఆర్థికంగా, సామాజికంగా అభాగ్యులైన వారికి నెలకు రూ.4 వేలు

సాక్షి, అమరావతి: ఏపీలో మహిళా శిశు సంక్షేమానికి అనేక చర్యలు చేపడుతున్న ప్రభుత్వం అనాథలు, అభాగ్యులైన బాలలకు సైతం కొండంత భరోసా ఇస్తోంది. తల్లిదండ్రులను కోల్పోయిన వారు, తల్లిదండ్రులకు దూరమైన వారు, అనేక రకాల బాధిత పిల్లల విద్య, పౌష్టికాహారం, ఆరోగ్య అవసరాలతో పాటు సంరక్షణ, పునరావాసం కల్పించడంలో పెద్ద మనస్సుతో వ్యవహరిస్తోంది. ఇందుకోసం స్పాన్సర్‌షిప్, పోస్టర్ కేర్ వంటి పథకాల ద్వారా అర్హులైన బాలలు ఒక్కొక్కరికి నెలకు రూ.4 వేలు సహాయం అందిస్తోంది. తాజాగా స్పాన్సర్‌షిప్ పథకం ద్వారా రాష్ట్రంలో 7,253 మంది పిల్లలకు ఏడు నెలలకు రూ.19,56,20,000, పోస్టర్ కేర్ ద్వారా మరో 20 మందికి 9 నెలలకు రూ.7,20,000 విడుదల చేసినట్టు ఏపీ మహిళా శిశు సంక్షేమ శాఖ ఇన్‌చార్జి సంచాలకుడు బి.రవిప్రకాశ్‌రెడ్డి తెలిపారు. స్పాన్సర్‌షిప్ పథకంలో ఆర్థికంగా, సామాజికంగా బలహీనమైన బాలల విద్య, పోషకాహారం, ఆరోగ్య అవసరాల కోసం నెలకు రూ.4 వేలు ఆర్థిక సాయం అందిస్తారు. అలాగే పోస్టర్ కేర్ పథకంలో పిల్లల సంరక్షణ, పునరావాసం కోసం నెలకు రూ.4 వేలు ఆర్థిక సాయం అందిస్తారు.

ఏపీలో 16 నుంచి వర్షాలు



సాక్షి, విశాఖపట్నం: ఈసారి వేసవిలోనూ వర్షాలు పలకరించనున్నాయి. ఈ నెల 16 నుంచి 20వ తేదీ వరకు ఏపీలో వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ విభాగం వెల్లడించింది. ప్రస్తుతం రాష్ట్రంపైకి తూర్పు, ఆగ్నేయ దిశల నుంచి గాలులు వీస్తున్నాయి. నాలుగు రోజుల్లో ఈ గాలులు దిశ మార్చుకుని దక్షిణ దిశ నుంచి వీచే అవకాశం ఉంది. దీని ప్రభావం 4 రోజులపాటు ఉండనుంది. ఫలితంగా 16 నుంచి 20 వరకు రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని ఐఎండీ శనివారం నాటి బులెటిన్‌లో తెలిపింది.

మా బిడ్డను కొట్టి చంపారు!

న్యాయం చేయాలని నిఖిత తల్లిదండ్రుల ఆందోళన



అమ్రాబాద్‌లో రాస్తారోకో చేస్తున్న కుటుంబసభ్యులు

మన్ననూర్: తమ బిడ్డను కొట్టి చంపి.. ఆత్మహత్యగా చిత్రీకరించిన ప్రిన్సిపాల్ లలితకుమారి, ఉపాధ్యాయురాలు గీతారాణిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ అమ్రాబాద్ మండల కేంద్రంలోని అంబేద్కర్ కూడలిలో నిఖిత కుటుంబ సభ్యులు శనివారం రాస్తారోకో నిర్వహించారు. నాలుగు రోజుల క్రితం మన్ననూర్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో తరగతి గదిలోనే ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నదన్న సంఘటన విధితమే. అభం శుభం తెలియని 7వ తరగతి చదువుతున్న బాలికపై ప్రేమ వ్యవహారమని ఆరోపణలు చేయడంపై.. తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ రుజువు చేసేంత వరకు ఆందోళన విరమించేది లేదన్నారు. మూడేళ్లుగా పాఠశాలలోని కొందరు ఉపాధ్యాయులు ఆడిందే ఆట పాడిందే పాటగా ఉందన్నారు. తల్లిదండ్రులు పిల్లల కోసం సెలవు దినంలో పాఠశాలకు పోతే కనీస బాధ్యత లేకుండా వ్యవహరిస్తారన్నారు. నాకూతురు నిఖితకు జరిగిన అన్యాయం మరో విద్యార్థికి కాకుండా ఉండాలంటే ఎంతో కాలంగా అదే పాఠశాలలో పాతుకుపోయిన వారిని వెంటనే స్థాన చలనం చేయాలన్నారు. అదే విధంగా మృతికి సంబంధించిన వారందరిపై చర్యలు తీసుకోవాలని అమ్రాబాద్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

పాఠశాలకు తిరిగి వస్తున్న విద్యార్థులు

స్థానిక సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల, కళాశాలలో విద్యార్థి ఆత్మహత్యతో భయాందోళనకు గురై తమ ఇళ్లకు వెళ్లిన విద్యార్థులు తిరిగి పాఠశాలకు వస్తున్నారు. గురువారం పాఠశాల పరిస్థితులు తెలుసుకోవడం కోసం ఆర్‌సీఓ వనజ సందర్శించారు. విద్యార్థులు లేకుండా పాఠశాల పరిసరాలు మొత్తం నిర్మానుష్యంగా కనిపించాయి. స్పందించిన ఆమె పరీక్షల సమయం అయినందున విద్యార్థులను పాఠశాలకు పంపించాలని తల్లిదండ్రులకు కోరారు. అన్ని రకాల సౌకర్యాలతో పాటు పూర్తి రక్షణ బాధ్యత తీసుకుంటామని తెలియజేశారు. శుక్రవారం, శనివారం పాఠశాల విద్యార్థులతో పాటు కళాశాల విద్యార్థుల తల్లిదండ్రులు కూడా పాఠశాల వద్దకు వచ్చి పంపించారు. ఇప్పటి వరకు 60 మంది విద్యార్థులు పాఠశాలకు వచ్చినట్లు తెలిసింది.

విద్యార్థిని మృతిపై సమగ్ర విచారణకు డిమాండ్



మాట్లాడుతున్న మూలె కేశవులు

నాగర్‌కర్నూల్ జిల్లా మన్ననూర్‌లోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాల (బాలికల)లో నిఖిత మృతిపై పూర్తి స్థాయిలో విచారణ చేయాలని మాలల చైతన్య సమితి రాష్ట్ర అధ్యక్షుడు మూలె కేశవులు డిమాండ్ చేశారు. శనివారం మన్ననూర్‌లోని అంబేద్కర్ కూడలిలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మృతికి పాఠశాల ప్రిన్సిపాల్‌ను ఒక్కరినే బాధ్యులను చేయడంలో పలు అనుమానాలకు తావిస్తుందని అన్నారు. పాఠశాలలోని ఇద్దరు టీచర్లు కూడా ఆత్మహత్యకు కారణమయ్యారనే ఆరోపణలు వినిపిస్తున్నప్పటికీ అధికారులు, పోలీసులు ఆ దిశగా విచారణ చేయడం లేదన్నారు. పాఠశాల సమయంలో యూనిఫాంలో ఉండాల్సిన నిఖిత సివిల్ డ్రెస్‌లో అందనంత ఎత్తులో ఉన్న సీలింగ్ ఫ్యాన్‌కు చున్నీతో ఉరి వేసుకొని ఉండటం ఏమిటో అంతుపట్టని విధంగా అన్నారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుని ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా విద్యార్థులకు పూర్తి స్థాయిలో రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. అధికారులు, పోలీసులు ఉద్దేశపూర్వకంగా విచారణను తప్పుదారి పట్టిస్తే దళిత సంఘాల ఆధ్వర్యంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. బాధిత కుటుంబానికి రూ.50లక్షల ఎక్స్‌గ్రేషియా, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం, డబుల్ బెడ్‌రూం ఇల్లు, మూడు ఎకరాల వ్యవసాయ పొలం ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో చెన్నకేశవులు, లక్ష్మయ్య, మల్లేష్, పర్వతాలు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ పాలనలో ప్రజాస్వామ్యం కూనీ

మాజీ మంత్రి నాగం జనార్దన్‌రెడ్డి



మాట్లాడుతున్న నాగం జనార్దన్‌రెడ్డి

కందనూలు: ఇతర పార్టీల్లో గెలిచిన ఎమ్మెల్యేలను బీఆర్‌ఎస్ పార్టీలో చేర్చుకుని ప్రజాస్వామ్యం కేసీఆర్ కూనీ చేశారని మాజీ మంత్రి నాగం జనార్దన్ రెడ్డి అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని తన నివాసంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రజాసామ్యం బ్రతకాలంటే ప్రతిపక్షాలు ఉండాలని, రాష్ట్రంలో అందుకు విరుద్ధంగా కేసీఆర్ అరాచక పాలన కొనసాగిస్తున్నారని విమర్శించారు. నేతల అవినీతిపై ప్రశ్నిస్తే కేసులు, వేధింపులు పరిపాటిగా మారాయని అన్నారు. పోలీసుల పహారాలో పాలన చేస్తున్న కేసీఆర్‌కు వచ్చే ఎన్నికల్లో బుద్ధి చెప్పడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. ఎన్నికలు వస్తేనే స్కీంలు గుర్తొస్తాయా అని ప్రశ్నించారు. డబుల్ బెడ్రూం ఇళ్లు, దళితులకు మూడెకరాల భూమి, రుణమాఫీ, నిరుద్యోగ భృతి ఏ స్కీం ప్రజలకు ఇచ్చావో చెప్పాలని డిమాండ్ చేశారు. సొంత స్థలం ఉంటే రూ.3లక్షలు ఇంటి నిర్మాణం కోసం ఇస్తానని అంటున్నారు.. అసలు డబుల్ బెడ్రూం ఇళ్ల కథ ఎక్కడి వరకు వచ్చిందో చెప్పాలన్నారు. పేదలకు ఇళ్లు కట్టించిన చరిత్ర కాంగ్రెస్ పార్టీదని, ఉన్న ఇళ్లను కూల్చిన చరిత్ర బీఆర్‌ఎస్‌ది అన్నారు. కల్వకుంట్ల కుటుంబం, బీఆర్‌ఎస్ నేతల అవినీతితో ఉద్యోగులకు జీతాలు ఇవ్వలేని స్థితికి రాష్ట్రం దివాళా తీసిందని విమర్శించారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో విద్యావేత్త హర్షవర్ధన్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో రవి, నాగం శశిధర్ రెడ్డి, జెడ్పీటీసీ సుమలత తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి హాకీ పోటీలకు జట్టు ఎంపిక



ఎంపికైన రాష్ట్ర జట్టుతో ప్రతినిధులు

వనపర్తి: తమిళనాడు రాష్ట్రంలోని రామంతపురంలో ఈనెల 19 నుంచి 26వ తేదీ వరకు నిర్వహించే జాతీయస్థాయి సౌత్‌జోన్ హాకీ పోటీల్లో రాష్ట్ర జట్టును ఎంపిక చేసినట్లు హాకీ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కుమార్, మహబూబ్‌నగర్ కార్యదర్శి శ్రీనివాస్‌గౌడ్, రంగారెడ్డి జిల్లా కార్యదర్శి భాస్కర్‌రెడ్డి వెల్లడించారు. అర్జున అవార్డు గ్రహీత ముఖేష్ పర్యవేక్షణలో శనివారం జిల్లా కేంద్రంలోని డాక్టర్ బాలకిష్టయ్య క్రీడా ప్రాంగణంలో రాష్ట్ర జట్టు కోసం సెలక్షన్స్ పోటీలు నిర్వహించారు. అత్యంత ప్రతిభ కనపరిచిన వారిని జట్టులో ఎంపిక చేశారు. జాతీయస్థాయిలో ప్రతిభ కనపరిచిన క్రీడాకారులను భారత జట్టుకు ఎంపిక చేసే అవకాశం ఉంటుందని వారు తెలిపారు.

ఎంపికైన క్రీడాకారులు

తేజ, హనుమంతు, భాస్కర్, గగన్, ఎండీ అమాంజ, శ్రీరామ్, సృజన్, సాయికృష్ణ, ఎండీ బెహన్ ఖాన్, అర్జున్ టెండూల్కర్, దివాకర్, నితిన్, విజయ్, మహేందర్, జగజీవన్, మోతీరాం, అరుణ్, అమీర్‌ఖాన్, సబ్‌ట్యూట్‌గా చరణ్, శివన్న, రాజేష్‌లను ఎంపిక చేశారు.

మెరుగైన వైద్య సేవలు అందించాలి

- పీహెచ్‌సీని సందర్శించిన కేంద్ర బృందం
- ఎన్‌కాస్ గుర్తింపు లభిస్తే పీహెచ్‌సీకి ఏడాదికి రూ.3లక్షలు



ఆస్పత్రి సిబ్బందితో కేంద్ర బృందం

గట్టు: మారుమూల ప్రాంతమైనా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ద్వారా మెరుగైన వైద్య సేవలను అందిస్తున్నారని, దీన్ని భవిష్యత్‌లో కొనసాగించాలని కేంద్ర బృందం (ఎన్‌కాస్ టీం) ఇందుమతిపాటిల్, అబ్బాస్‌అహ్మద్ సూచించారు. రెండవ రోజు శనివారం కేంద్రం బృందం మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి, వైద్యులు, సిబ్బంది, ఏఎన్‌ఎం, ఆశాలతో సమావేశమయ్యారు. కాన్పుల విషయంలో పీహెచ్‌సీ రాష్ట్రంలోనే రెండవ స్థానంలో ఉండడం అభినందనమని తెలిపారు. గర్భిణుల మరణాలు నమోదు కాకపోవడంతో సంతోషించాల్సిన విషయమన్నారు. ఏఎన్‌ఎం, ఆశాలు ప్రజలతో మంచి సంబంధాలను కలిగి ఉండాలన్నారు. ఎన్‌కాస్ అనేది సెంట్రల్ టీం అని, సెంట్రల్ గవర్నమెంట్‌కు వైద్య సేవలపై పూర్తి స్థాయిలో పరిశీలన చేసిన తర్వాత నివేదకను అందజేయనున్నట్లు తెలిపారు. ఈ నివేదిక ఆధారంగా ఇక్కడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పాసైతే కేంద్రం ప్రభుత్వం వచ్చే మూడేళ్ల పాటు ఏడాదికి రూ.3 లక్షలను ఏటా కేంద్రానికి అందజేస్తున్నట్లు తెలిపారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంతో పాటుగా సబ్ సెంటర్ల పరిసరాలు కూడా పరిశుభ్రంగా ఉండేలా చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి స్రవంతి, రాజు, సీహెచ్‌ఓ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఎదుర్కోలేకనే కక్షసాధింపు చర్యలు

గిడ్డంగుల కార్పొరేషన్ చైర్మన్ సాయిచంద్



మాట్లాడుతున్న సాయిచంద్

అమరచింత: కేంద్రంలో అధికార దాహంతో రాష్ట్రాలను తమ ఆధీనంలోకి తీసుకునేందుకు ప్రధాని నరేంద్ర మోదీ, అమిత్‌షా ఉన్మాద చర్యలకు పాల్పడుతున్నారని గిడ్డంగుల కార్పొరేషన్ చైర్మన్ సాయిచంద్ అన్నారు. పట్టణంలో శనివారం బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. లిక్కర్ స్కాం పేరిట జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కవితపై తప్పుడు కేసులను పెట్టించి, విచారణ పేరుతో వేధింపులకు పాల్పడడం ఎంత వరకు సమంజసమన్నారు. రాష్ట్రాన్ని బంగారు తెలంగాణగా మార్చేందుకు నిరంతరం కృషి చేస్తున్న సీఎం కేసీఆర్‌ను ప్రజాస్వామ్య పద్ధతిన ఎదుర్కోలేక, తమ ప్రజాప్రతినిధులను భయపెట్టడమే పనిగా పెట్టుకున్నారన్నారు. మతోన్మాదాన్ని వ్యతిరేకించే రాష్ట్రాలపై ఇలాంటి కుటిల రాజకీయ నాటకాలు ప్రదర్శించి ఆయా రాష్ట్రాల మంత్రులు, ఎమ్మెల్యేలపై అక్రమ కేసులు పెట్టడం మానుకోవాలన్నారు. రాష్ట్రంలో సుపరిపాలన, ప్రజాదరణ బీఆర్‌ఎస్‌కే సొంతమని భావించి, మతాల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టడం బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌కు అలవాటుగా మారిందన్నారు. భరత మాత అంటూనే ఆడపడుచులను వ్యంగంగా మాట్లాడే వారికి తెలంగాణ బిడ్డలు తగిన బుద్ధి చెబుతారన్నారు.